పోలింగ్‌కు అంతా సిద్ధం

- ఉదయం 7 నుంచి సాయంత్రం 5 వరకు పోలింగ్
- కేంద్రాలకు సామగ్రితో చేరుకున్న సిబ్బంది



ఎన్నికల కోసం విధులకు హాజరైన అధికారులు, సిబ్బంది

మణికొండ: అసెంబ్లీ ఎన్నికలకు రంగమంతా సిద్ధమైంది. ఎన్నికలను నిర్వహించే సిబ్బంది, అధికారులు బుధవారం మధ్యాహ్నం తమ ఎన్నికల సామాగ్రిని తీసుకుని సాయంత్రానికి వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. అప్పటికే సిద్ధం చేసిన పోలింగ్ కేంద్రాలలో పోలింగ్‌కు అవసరమైన ఏర్పాట్లను చేసుకున్నారు. గురువారం ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలైన్లలో ఉన్న వారికి సమయంతో సంబంధం లేకుండా ఓటింగ్‌లో పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తున్నారు. మొదటగా అన్ని పార్టీల పోలింగ్ ఏజెంట్లతో మాక్ పోలింగ్ నిర్వహించి అనంతర సాధారణ పోలింగ్‌ను నిర్వహించేందుకు సిద్ధమయ్యారు.

- ప్రజలకు సమీపంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. పోలింగ్ కేంద్రాలకు వచ్చిన సిబ్బంది, అధికారులకు పోలీసులు భద్రతను ఏర్పాటు చేశారు.

ఎవరి పనుల్లో వారు..

- తమ పార్టీ అభ్యర్థుల గెలుపునకు నెలరోజులుగా కృషి చేసిన ఆయా పార్టీల క్యాడర్ గురువారం జరిగే ఎన్నికల్లో తమ అభ్యర్థులకు అనుకూలంగా ఓట్లు వేయించేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు.
- పోలింగ్ కేంద్రాలకు సమీపంలో కేంద్రాలను ఏర్పాటు చేసుకుని ఓటింగ్‌కు వచ్చే వారికి అక్కడక్కడ వారి పోలింగ్ కేంద్రం, ఓటరు సంఖ్యలను తెలియజేసే చీటీలను అందజేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు.
- ప్రతి ఒక్కరూ పోలింగ్‌లో పాల్గొనాలని, తమ పార్టీ అభ్యర్థులకు ఓటు వేయాలని బుధవారం సైతం ఫోన్లు, సోషల్ మీడియాల్లో కోరారు.
- ఓటుహక్కు ఉన్న ప్రతి ఒక్కరూ పోలింగ్‌లో పాల్గొని తమ ఓటును సద్వినియోగం చేసుకోవాలని ఎన్నికల అధికారులు కోరారు.
- పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అవసరమైన ఏర్పాట్లు చేశామని, ఎలాంటి ఇబ్బంది లేకుండా ఓటింగ్‌లో పాల్గొనవచ్చని వారు సూచించారు.

పోలింగ్ బూత్‌లకు చేరిన సామగ్రి..

రాజేంద్రనగర్: నియోజకవర్గ పరిధిలోని పోలింగ్ బూత్‌లకు ఎన్నికల సామగ్రిని రిటర్నింగ్ అధికారి మల్లయ్య ఆధ్వర్యంలో తరలించారు. బుధవారం వెటర్నరీ కళాశాల ఎన్‌సీసీ గ్రౌండ్ నుంచి నియోజకవర్గంలోని 542 పోలింగ్ బూత్‌లకు ఎన్నికల సిబ్బందితో పాటు ఎన్నికల సామగ్రిని తరలించారు. ఉదయం 7 గంటల నుంచి తరలింపు ప్రక్రియను ప్రారంభించారు. ఎన్నికల విధుల కోసం వచ్చిన ఉద్యోగుల అటెండెన్స్‌ను తీసుకున్న అనంతరం వారికి పోలింగ్ కేంద్రాలను కేటాయించారు. ప్రతి పోలింగ్ బూత్‌కు ఒక పీఓ, ఒక ఏపీఓ, ఇద్దరు సిబ్బందిని కేటాయించారు. వీరికి ఎన్నికల సామగ్రితో పాటు ఈవీఎంలు, సీయూలు, వీవీ ప్యాడ్‌లను అందించారు. ఈ ఏడాది ప్రతి పోలింగ్ బూత్‌కు వీల్ చైర్లను ప్రత్యేకంగా పంపిణీ చేశారు.

- ఈ ప్రక్రియ మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొనసాగింది. అనంతరం మధ్యాహ్న భోజనం చేసిన 41 రూట్ల ద్వారా సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు బస్సుల్లో తరలించారు.
- 41 రూట్లలో 41 మంది సెక్టోరల్ అధికారులను నియమించి పోలింగ్ కేంద్రానికి పూర్తి సామగ్రితో సురక్షితంగా చేరేలా చర్యలు చేపట్టారు.
- పోలింగ్ సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు వెళ్లి అక్కడే ఈ రాత్రి బసచేసి పోలింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేసుకోనున్నారు. గురువారం ఉదయం 5.30 గంటలకు మాక్ పోలింగ్‌ను చేపట్టనున్నారు. అనంతరం పోలింగ్ ప్రక్రియను 6 గంటల నుంచి ప్రారంభించనున్నారు. సిబ్బందికి ఇప్పటికే పూర్తి శిక్షణను పూర్తి చేశారు.
- ప్రతి పోలింగ్ బూత్‌లో వెబ్ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఎన్నికల విధుల కోసం 6 వేల మంది సిబ్బంది ప్రస్తుతం పని చేస్తున్నారు. వీరితో పాటు స్థానికంగా ఉండే మున్సిపల్, పంచాయతీ, జీహెచ్‌ఎంసీ సిబ్బందికి వీరికి సహాయ సహకారాలు అందజేయనున్నారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులను కల్పించారు.



మణికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సిద్ధమైన పోలింగ్ కేంద్రం



పోలింగ్ కేంద్రాలకు వస్తున్న అధికారులు, సిబ్బంది

ఘనంగా కార్తీకమాస వన భోజనాలు

జియాగూడ: ప్రతి యేటా ఆర్యవైశ్య సంఘం పురానాపూల్ కార్వాన్ ఆధ్వర్యంలో కార్తీకమాస వన భోజనాలను ఘనంగా నిర్వహిస్తామని ప్రాజెక్టు కన్వీనర్ మాడిశెట్టి సదానందం గుప్తా, ప్రాజెక్టు చైర్మన్ యాద శ్రీనివాస్‌గుప్తా అన్నారు. బుధవారం పెంజర్ల అనంత పద్మనాభస్వామి ఆలయ ఆవరణలో ఆర్యవైశ్య సంఘం పురానాపూల్ కార్వాన్ ద్వారా కార్తీ వనభోజన కార్యక్రమం ఏర్పాటైంది. సదానందంగుప్తా మాట్లాడుతూ..కార్తీకమాసంలో వనభోజనాల వల్ల సంఘం సంఘటితమవుతుందని పేర్కొన్నారు. సురేష్‌గుప్తా, జగిని యాదగిరి గుప్తా, గోవింద్‌గుప్తా, అనితరెడ్డి, రమేష్, ధనుంజయ, కొండ రమేష్ పాల్గొన్నారు.

144 సెక్షన్ అమలు

- రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి



జగదీశ్వర్‌రెడ్డి, రాజేంద్రనగర్ డీసీపీ

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలో ఎన్నికల నేపథ్యంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని రాజేంద్రనగర్ డివిజన్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి వెల్లడించారు. పోలింగ్ బూత్‌ల వద్ద ఇద్దరికి మించి గుమిగూడొద్దని సూచించారు. ఆయన కార్యాలయంలో బుధవారం మాట్లాడుతూ.. ఎన్నికల నేపథ్యంలో భారీ బందోబస్తును ఏర్పాటు చేశామని, బందోబస్తుకు స్థానిక పోలీస్‌స్టేషన్ల అధికారులు, సిబ్బందితో పాటు కేంద్ర బలగాలను, ఏపీఎస్పీ, ఆర్మ్‌డ్‌ఫోర్స్ పోలీసులను వినియోగిస్తున్నామన్నారు. పోలింగ్ బూత్‌ల వద్ద బందోబస్తు కోసం ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. పోలింగ్ బూత్‌లకు కేవలం ఓటు వేసేందుకు వచ్చే ఓటర్లను మాత్రమే పోలీసులు తనిఖీ చేసి పంపిస్తామని, ఇతరులకు ఎవరికీ ప్రవేశం ఉండదన్నారు. పోలింగ్ కేంద్రానికి సెల్‌ఫోన్‌తో పాటు ఇతర ఉపకరణాలను తీసుకురావొద్దన్నారు. ప్రశాంత వాతావరణంలో పోలింగ్‌ను నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేశామన్నారు. పోలింగ్ బూత్‌లను బుధవారం ఆయన పరిశీలించారు. పోలింగ్ బూత్‌ల వద్ద చేపట్టాల్సిన భద్రతా చర్యలతో పాటు సిబ్బందికి పలు సూచనలు అందించారు. పోలింగ్ ఏజెంట్లు తప్పనిసరిగా తమ గుర్తింపుకార్డుతో రావాలన్నారు. పోలింగ్ కేంద్రం వద్ద ఎవరూ గుమిగూడొద్దన్నారు. తమ వద్ద ఎలాంటి సమాచారమున్నా, స్థానిక పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

సొంతూళ్లకు బయల్దేరిన ఓటర్లు



కాళీమందిర్ చౌరస్తా వద్ద..

ఓటుహక్కు వినియోగించుకునేందుకు ఓటరు సన్నద్ధం

బండ్లగూడ: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో తమ ఓటును వినియోగించుకునేందుకు ప్రజలు తమ ఊళ్లకు పయనమయ్యారు. బతుకుదెరువు కోసం ఊళ్ల నుంచి వచ్చిన వారు బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో నివాసాలను ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నారు. కార్పొరేషన్ పరిధిలో ఉంటూ నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాలు చేసుకుంటున్నారు. నగర శివారు ప్రాంతం కావడంతో నగరానికి, ఊళ్లకు ఇది మధ్యలో ఉండటంతో ప్రజలు చాలా మంది బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జీవించేందుకు ఆసక్తి చూపుతుంటారు. కొడంగల్, తాండూర్, వికారాబాద్, చేవెళ్ల, షాబాద్ తదితర ప్రాంతాలకు చెందిన వారు అధికంగా ఉంటుంటారు. ఇక్కడ నివసిస్తున్నప్పటికీ వారి చిరునామాలు, ఆధార్, ఓటర్‌కార్డులు అన్ని ఊళ్లకు సంబంధించినవే ఉంటాయి. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు ఈనెల 30న ఉండటంతో తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ప్రజలు బుధవారం తమ సొంతూళ్లకు బయలుదేరారు. కార్పొరేషన్ పరిధిలోని కాళీమందిర్ ప్రాంతంలో ఊళ్లకు వెళ్లే వారు భారీ ఎత్తున చేరుకున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు భారీ సంఖ్యలో ప్రజలు చౌరస్తాకు చేరుకుని బస్సులు ఎక్కుతూ.. కనిపించారు.

'జోరుగా పోల్ మేనేజ్‌మెంట్'!

అత్తాపూర్: ప్రచార గడువు ముగిసిపోవడంతో రాజేంద్రనగర్ అభ్యర్థులు పోటాపోటీగా ఓటర్లను ఆకట్టుకునే పనిలో మునిగిపోయారు. మద్యం, డబ్బు పంపిణీ జోరుగా కొనసాగుతోంది. ఒక్కో ఓటు రెండు వేలతో ఆకట్టుకునే యత్నాలు చేస్తున్నట్లు సమాచారం. చాలా చోట్ల మద్యం సీసాలు మంగళవారం సాయంత్రమే పంపిణీ అయినట్లు తెలుస్తోంది. వనరులు పుష్కలంగా ఉన్న అధికార పార్టీ రెండుసార్లు మద్యం పంపిణీ చేసినట్లు విశ్వసనీయ సమాచారం. అధికార పార్టీతో పాటు ఇతర పార్టీలు కూడా పంపిణీ చేసినట్లు పలువురు చెబుతున్నారు. ప్రస్తుతం జెండాలు, బ్యానర్‌లు లేకుండా నిశబ్ద వాతావరణం నెలకొంది. కాలనీల్లో పెద్దలతో ఓటు వేయించడం కోసం నోట్లు వేయించుకున్నట్లుగా సమాచారం. నిఘా యంత్రాంగం ఎంత కట్టడి చేసినా మద్యం పంపిణీనీ మాత్రం అడ్డుకోలేకపోయాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.

డిస్ట్రిబ్యూషన్ సెంటర్ సందర్శన



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ భారతి హోలీకేరి

రాజేంద్రనగర్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో వెటర్నరీ కాలేజీలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో చేపడుతున్న ఎన్నికల సామగ్రి పంపిణీ తీరుతెన్నులను కలెక్టర్, ఎన్నికల పోలీస్ పరిశీలకులు ఉత్పల్ కుమార్ నస్కర్‌ఈతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తాగునీటి వసతి, వైద్యశిబిరం, అల్పాహారం, భోజన వసతి ఇతర అన్ని వసతులను ఏర్పాటు చేయగా.. పీఓ, ఏపీఓలతో కూడిన బృందాల హాజరుపై కలెక్టర్ ఆరా తీశారు. ఈవీఎంల పనితీరును ఆమె పరిశీలించారు. ఎలాంటి లోటుపాట్లు గందరగోళానికి తావు లేకుండా సిబ్బందికి పోలింగ్ సామగ్రిని పక్కాగా అందించాలన్నారు. సకాలంలో నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకునేలా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి ఇబ్బందులున్నా తమ దృష్టికి తీసుకురావాలని ఆర్‌ఓలకు సూచించారు. రిటర్నింగ్ అధికారి మల్లయ్య తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వారికి ఫస్ట్ ఎయిడ్

గచ్చిబౌలి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి సపర్యలు చేశారు ట్రాఫిక్ పోలీసులు. బుధవారం ఉదయం ద్విచక్రవాహనంపై వెళుతున్న ఇద్దరు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ వారి దగ్గరికి వెళ్ళి సపర్యలు చేసి ఆస్పత్రికి వెళ్లాలని సూచించారు. వారికి ఫస్ట్ ఎయిడ్ చేసి పంపించారు. ఇతర వాహనదారులు ఆయన చొరవను అభినందించారు.



నాలెడ్జి సిటీలో సీ1 గ్లోబల్ ఇన్నోవేషన్ కేపబిలిటీస్ సెంటర్



రాయదుర్గం: హైదరాబాద్ నాలెడ్జిసిటీలో సీ1 (కన్వర్జ్‌వన్) గ్లోబల్ ఇన్నోవేషన్ అండ్ కేపబిలిటీస్ సెంటర్ (జీఐసీసీ) తన కార్యకలాపాలను భారతదేశంలో ప్రారంభించింది. ఈ సంస్థ కార్యాలయాన్ని బుధవారం జీఐసీసీ సంస్థ సీఈఓ జెఫ్రీ రస్సెల్ ప్రారంభించారు. సీ1 అధునాతన సాంకేతికత, పరిష్కారాల సంస్థ. దీన్ని ప్రారంభించిన అనంతరం విలేకరులలో ఆ సంస్థ సీఈఓ జెఫ్రీ రస్సెల్ మాట్లాడుతూ 10వేలకు పైగా గ్లోబల్ వినియోగదారులకు వినూత్న పరిష్కారాలను, అసమానమైన సేవలను అందించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో సీ1 ఇండియా మేనేజింగ్ డైరెక్టర్, కంట్రీ హెడ్ చంద్ర బొడ్డోజు, చీఫ్ హ్యూమన్ రిసోర్సెస్ ఆఫీసర్ కొలీన్ హెబర్‌మాన్, చీఫ్ గ్రోత్ ఆఫీసర్ అమృత్‌చౌదరి, అధికారులు పాల్గొన్నారు.